ఊరెళ్తే సమాచారం ఇవ్వండి

ఏసీపీ జైపాల్‌రెడ్డి



బౌద్ధనగర్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి సూచించారు. అంతే కాక పక్కింటి వారికి కూడా చెప్పి వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పద్మారావునగర్, చిలకలగూడ, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బీదల బస్తీ, వారాసిగూడ, మేడిబావి, ఇందిరానగర్ కాలనీ, బౌద్ధనగర్, అంబర్‌నగర్, లలితానగర్, పార్శిగుట్ట, గంగపుత్ర కాలనీ, రామ్‌నగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. అత్యధికంగా పేద, మధ్య తరగతి ప్రజలు నివాసించే ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అంతగా లేవు. దీంతో దొంగలు ముఖ్యంగా ఈ ప్రాంతాలను ఎంచుకొని చోరీలకు పాల్పడుతుంటారు. సీసీ కెమెరాలు ఉన్న ఇంటి వారు వాటిని ఆన్ లోనే పెట్టి వెళ్లాలని సూచించారు. అందువల్ల ఈ ప్రాంత ప్రజలు ఎవరైతే ఊళ్లకు వెళ్తున్నారో ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పదంగా బస్తీలలో ఎవరైన కనిపిస్తే వెంటనే 100కు నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఇళ్లలో ఉండే బంగారు ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో లేదా వెంట తీసుకెళ్లాలని ఏసీపీ సూచించారు.

ప్రియాంక గాంధీ పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

సనత్‌నగర్: ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బేగంపేటలోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేసి కేక్ కట్ చేశారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట మణిమాల హాజరై మాట్లాడారు. ప్రియాంక గాంధీ నేతృత్వంలో మహిళలంతా ఏకతాటి పైకి వచ్చి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఘనంగా సన్యాస స్వీకార దీక్షా యాత్ర



ర్యాలీలో పాల్గొన్న జైన మతస్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువతి జైన సన్యాస స్వీకారోత్సవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన దీక్షా యాత్ర ఘనంగా సాగింది. చంపాలాల్ జీ రమణి కుటుంబానికి చెందిన సైనా అనే యువతి జైన సన్యాస దీక్ష తీసుకుంది. శనివారం ఎంజీరోడ్డులోని టీ-19 టవర్ నుంచి మినిస్టర్ రోడ్, డీవీకాలనీ, పీజీరోడ్ మీదుగా హర్యానా భవన్ వరకు జైన మతస్తులు, ఆమె బంధువులు బ్యాండు మేళాలతో ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హర్యానా భవన్‌లో సింహోత్సవ దీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు.

పోలీసుల తీరుపై ఆగ్రహం..

సాంప్రదాయాలతో సాగే ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం పట్ల జైన సమాజానికి చెందిన ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల క్రితం అనుమతికి దరఖాస్తు చేస్తే ముందు రోజు రాత్రి నిరాకరించారని వాపోయారు.



వావ్ అనిపించేలా వార్షికోత్సవం



సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్ 36వ వార్షిక వేడుకల్లో విద్యార్థుల ఆటపాటలతో హోరెత్తించారు. భారతీయతను తట్టి లేపేలా త్రివర్ణ డ్రెస్సులు ధరించి చేసిన సాంస్కృతిక నృత్యం అలరించింది. సినీ గీతాలకు లయబద్ధంగా వేసిన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. ఇస్రో గొప్పతనాన్ని చాటుతూ సాగిన నృత్యం, గణనాథుడు, సాంబశివుడిని స్తుతిస్తూ సంప్రదాయ నృత్యాలు కట్టిపడేశాయి. తెలంగాణ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.శృతిరావు పాల్గొని ప్రసంగించారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నూతనోత్తేజం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సీహెచ్. హనుమంతరావు, స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ట్రస్ట్ సభ్యులు త్రిపాటి, కంజర్ల చంద్రకళయాదవ్, చంద్రశేఖర్‌గుప్తా, ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.





అంతటా సంక్రాంతి జోష్



విక్రయానికి సిద్ధంగా ఉంచిన రంగులు

కిటకిటలాడుతున్న గాలిపటాల దుకాణాలు

కొనుగోలుదారులతో సందడిగా మార్కెట్లు

సనత్‌నగర్: నగరమంతా సంక్రాంతి జోష్ మొదలైంది. పల్లె సంస్కృతికి అద్దం పడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకొనే సంక్రాంతి వేడుకల్లో ఆదివారం నాటి భోగి పండుగ ఏర్పాట్లలో జనమంతా నిమగ్నమయ్యారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి మహానగరంలో సైతం పల్లె వాతావరణాన్ని గుర్తుకు తెచ్చేలా ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. చిన్నారులకు భోగి (రేగి) పండ్లు పోసి శుభాశీస్సులు అందించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన కాలనీల్లోని అపార్ట్‌మెంట్ వాసులంతా ఒకచోట చేరి భోగి పండ్లు పోసే కార్యక్రమాలను నిర్వహించుకునే సంస్కృతి నగరంలో ప్రతియేటా విస్తరిస్తోంది. మరో వైపు సంక్రాంతి వచ్చిందంటే కొత్త దుస్తుల కొనుగోలుదారులతో అమీర్‌పేట్‌లోని వస్త్ర వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. చిన్నారుల గాలి పటాల ఫైటింగ్‌లో కేరింతలు కొడుతూ సందడిని షూరూ చేశారు. పండుగ రోజు ప్రత్యేక పూజాది కార్యక్రమాల నిర్వహణకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గోదా, రంగనాథుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో ఆదివారం గోదా, రంగనాథుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. సంజీవరెడ్డినగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం, బల్కంపేట్ రేణుకా ఎల్లమ్మ , ఈఎస్ఐ చౌరస్తాలోని విజయలక్ష్మి దేవాలయం తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

వారాసిగూడ.. పతాంగుల అడ్డా..

బౌద్ధనగర్: సంక్రాంతి వచ్చిందంటే మొదటి గుర్తుకొచ్చేది గాలిపటాలు ఎగరేయడం పతంగుల విక్రయాలకు వారాసిగూడ ప్రాంతం పెట్టింది పేరు. ఇక్కడ అన్ని రకాల పతంగులు, మాంజాలు, చరఖ్‌లు లభిస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి వారి వారి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఈ సారి కూడా వారాసిగూడలో పతంగుల దుకాణాలు భారీగా వెలిశాయి. కాని, అనుకున్నంత స్థాయిలో గిరాకీలు లేవని విక్రయదారులు వాపోతున్నారు. పుష్ప, ఆర్ఆర్ఆర్, సలార్ సినిమాల హీరోల ఫొటోలతో కొన్ని డోరేమాన్, ఛోటా భీమ్ వంటి బొమ్మలతో తయారు చేసిన పతంగులు ఆకర్షిస్తున్నాయి.



గాలిపటాల దుకాణాల వద్ద సందడి

తార్నాక, లాలాపేటలో..

లాలాపేట: సంక్రాంతి పండుగ వాతావరణంలో ప్రజలందరూ నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలందరూ గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేస్తున్నారు. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారి ప్రక్కన ప్రత్యేక గాలిపటాల విక్రయ కేంద్రాలు వెలిశాయి. రకరకాలు, వివిధ రంగుల్లో తయారు చేసిన గాలిపటాలు, మాంజాలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

గిరాకీ తగ్గింది



గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి గిరాకీలు తగ్గాయి. ప్రభుత్వం వైర్ మాంజా నిషేధించడంతో ఆ మాంజాలు ఇక్కడ అమ్మడం లేదు. చాలా మంది వైర్ మాంజాలే అడుగుతున్నారు. లేవని చెప్పడంతో నగరంలోని ప్రాంతంలో లభిస్తాయని అక్కడికి పరుగులు తీస్తున్నారు. నిబంధనల ప్రకారం వైర్ మాంజాలు ఎక్కడా విక్రయించరాదు. కాని కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు వైర్ మాంజా విక్రయాల దుకాణాలపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలి. – ధర్మయ్య, విక్రయదారుడు

మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయం

లాలాపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. తార్నాక డివిజన్ లాలాపేట చౌరస్తాలో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు పాల్గొని నివాళి అర్పించారు. ప్రత్యేక తెలంగాణ కోసం చెన్నారెడ్డి ఉద్యమం, ఆరు సూత్రాల పథకం వంటి ఘటనలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. అనంతరం లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ లాల్, రామ్‌లాల్, ప్రవీణ్, ఆరెకటిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాపార్క్‌లో..

బన్సీలాల్‌పేట్: మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరా పార్కులోని మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద చెన్నారెడ్డి మనుమడు మర్రి ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీఎస్ నారాయణ, టి. మనోజ్‌కుమార్, డి. శ్రీనివాస్, జగదీష్, రాజేందర్, శ్యామ్, వెంకటేష్, సీపీ శంకర్, దశరథ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం, గవర్నర్‌గా మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలు మరువులేనివన్నారు.



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వకులాభరణం కృష్ణమోహన్‌రావు



మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించిన మర్రి ఆదిత్యరెడ్డి

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో గత 60 ఏళ్లుగా జరగని అభివృద్ధి గడిచిన పదేళ్లలో చేసి చూపించామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్‌కు చెందిన నరసింహామూర్తికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమైన చోట్ల ఫ్లై ఓవర్ల నిర్మాణం జరిపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామన్నారు. థీమ్ పార్కులు, ఇంటింటికీ మంచినీటి సరఫరా, క్రీడా మైదానాల అభివృద్ధి, శ్మశాన వాటికల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల శాశ్వత పరిష్కారం, కమ్యూనిటీ హాళ్లు, మోడల్ మార్కెట్లు ఇలా ప్రజావసరాలను తెలుసుకుని వాటన్నింటినీ సమకూర్చడం జరిగిందన్నారు. తనను మూడోసారి గెలిపించిన కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. అన్ని కాలనీలు, బస్తీలకు సమప్రాధాన్యంతో అభివృద్ధి చేస్తున్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

జెక్‌కాలనీ అభివృద్ధికి కృషిచేస్తా



ఎమ్మెల్యేను కలిసిన జెక్‌కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు శనివారం కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఆదివారం సంతాతో వ్యాపారులు కాలనీలోకి చొచ్చుకు రావడం మూలంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాహనాలతో రోడ్లన్నీ నిండిపోతున్నాయన్నారు. అదే విధంగా కాలనీలో పలురోడ్లు అధ్వానంగా మారాయని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదని వినతిలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంక్రాంతి తర్వాత జెక్‌కాలనీ సమస్యల పరిష్కారం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, ప్రతినిధులు నాగిరెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్ ఉన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 17 నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 32, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 19, చామగడ్డ 60, మొరంగడ్డ 25, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6.

కేంద్ర మంత్రిని కలిసిన ట్రస్మా ప్రతినిధి బృందం

అంబర్‌పేట: నూతనంగా ఎన్నికైన తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధి బృందం శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా స్కూల్ ఎడ్యుకేషన్-ఎన్ఐఓఎస్ ద్వారా ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్-స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌లను స్థాపించేందుకు ప్రైవేటు పాఠశాలలకు సబ్సిడీ రుణాలు అందించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ప్రతినిధులు బృందం కేంద్ర మంత్రిని కోరుతూ ఓ వినతి పత్రం అందజేశారు.

జింఖానా మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నగర వాసులకు వినోదం, ఆహ్లాదాన్ని పంచే వింటర్ ఉత్సవ్ మేళా ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. పిల్లలు, పెద్దలను అలరించేలా ఉన్న వివిధ రకాల స్టాల్స్, ఫిష్ అండర్ గ్రౌండ్ టన్నల్, ఎక్వేరియం, పొడవైన చేపలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఎగ్జిబిషన్ వినోదంతో పాటు పిల్లలకు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు. నెల రోజుల పాటు సాగే ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 10 గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు పతంగుల పంపిణీ

చిలకలగూడ: పతంగులు ఎగరేయడం తనకెంతో సరదా అని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు మ్యాకల చంద్రశేఖర్ నేతృత్వంలో రూపొందించిన పతంగులను శనివారం ఆవిష్కరించారు. మకర సంక్రాంతికి దోస్తులతో కలిసి పతంగులు ఎగరేస్తూ సందడి చేసే వాళ్లమని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిలకలగూడ చింతబావిలోని బీఆర్ఎస్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం చిన్నారులకు పంపిణీ చేయనున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సుంకు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



పతంగులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

రెడ్ ఎఫ్.ఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



విజేతకు బహుమతి అందజేస్తున్న శోభాశెట్టి, లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: రెడ్ ఎఫ్.ఎం సంస్థ ఆశీర్వాద్ మసాల ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్ శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బిగ్‌బాస్ సీజన్-7 పార్టిసిపెంట్ శోభాశెట్టి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ ఎఫ్.ఎం ఆర్జేలు రాజ్, చైతూ, శివ్, సూర్య మ్యూజిక్ ఎఫ్.ఎం ఆర్జేలు ప్రతీక, రవళి, సంగీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కొలను బాల్‌రెడ్డి, పుష్పలత శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం బీజేపీ నాయకులు అక్షింతలు పంపిణీ చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించాలని కోరుతూ అక్షింతలు, కరపత్రాలను సీతాఫల్‌మండి, ఉప్పరి బస్తీ, నామాల గుండు, ఫ్రైడే మార్కెట్, శ్రీనివాసనగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి పంపిణీ చేశారు. రాముని అక్షింతలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి చేరేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు రమేష్‌గౌడ్ తెలిపారు.



కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

శాస్త్రవేత్తలతో కలిసి.. పరిశోధనలు చేసి..

సీసీఎంబీలో ముగిసిన ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం • 'సాక్షి'తో విద్యార్థుల మనోభావాలు



సీసీఎంబీ ల్యాబ్‌లలో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు

లాలాపేట: ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులతో త్వరగా జీవితంలో స్థిరపడాలని నేటితరం విద్యార్థులంతా ప్రయత్నిస్తున్నారు. కానీ దేశాభివృద్ధికి కీలకమైన సైన్స్ పరిశోధనా రంగం వైపు చాలా తక్కువగా వస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో శాస్త్రవేత్తల కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచే నిత్య జీవితంలో లైఫ్ సైన్స్ ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు ఆసక్తి కల్గిన వారిని దేశాభివృద్ధికి కావాల్సిన శాస్త్రవేత్తలను తయారు చేయాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ నగరంలోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ) గత కొన్నేళ్ల నుంచి యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం(వైఐపీ)ను నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి వైఐపీకి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది దాదాపుగా 300 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో నుంచి 27 మంది విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసింది. ఎంపికైన ఈ 27 మంది పాఠశాల విద్యార్థులకు సీసీఎంబీలో సైన్స్ పరిశోధనలు చేసే అవకాశం లభించింది. శాస్త్రవేత్తలతో ముఖాముఖీ కార్యక్రమాలు, ల్యాబ్‌లు, పరిశోధనా పరికరాలు, లైఫ్ సైన్స్ పరిశోధనలు, ప్రాముఖ్యత, నిత్య జీవితంలో బయోటెక్నాలజీ పాత్ర, అక్కడ జరుగుతున్న పరిశోధనలు స్వయంగా తిలకించిన విద్యార్థులతో సాక్షి ముచ్చటించింది.

శాస్త్రవేత్తలతో కలవడం ఆనందంగా ఉంది..



దేశానికి ఉపయోగపడే పరిశోధనలు చేస్తున్న సైంటిస్టులతో నేరుగా కలిసి వారితో ముఖాముఖిగా మాట్లాడటం చాలా ఆనందంగా ఉంది. ల్యాబ్‌లలో వారు చేస్తున్న పరిశోధనలపై చెప్పిన అంశాలు తమ జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తోటి విద్యార్థులకు తెలియజేస్తాం. – హర్షిత, సిస్టర్ నవేదితా స్కూల్ అమీర్‌పేట్

సైన్స్‌పై ఆసక్తి పెరిగింది



ఈ ప్రోగాం ద్వారా సైంటిస్టులు నిరంతరం పరిశోధనలు చేసే కేన్సర్ ల్యాబ్, ట్యూబర్‌క్లోసిస్ ల్యాబ్, మైక్రోస్కోపి క్రిస్టలైజేషన్ వంటి ల్యాబ్‌ను చూసే అవకాశం లభించింది. పాఠ్యాంశాల్లో చదివిన విషయాలను ఇక్కడ నేరుగా చూడటం ద్వారా తమకు సైన్స్‌పై సరికొత్త ఆలోచనలు పెరిగాయి. – మల్లిగారి వెనియారెడ్డి, 9వ తరగతి, భారతీయ విద్యా భవన్ స్కూల్

శాస్త్రవేత్త కావాలనే ఆకాంక్ష..



సీసీఎంబీలో డీఎన్ఏ, డ్రాసోఫిల్లాలను ల్యాబ్‌ల్లో నేరుగా చూసేందుకు అవకాశం లభించడంతో సైన్స్‌పై ప్రత్యేకమైన ఆసక్తి పెరిగింది. భవిష్యత్‌లో శాస్త్రవేత్త కావాలనేది ఆకాంక్ష. ఇలాంటి ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరంగా ఉంది. – మోహనీష్ మహాపాత్ర, 9వ తరగతి, వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్

పరిశోధనలపై ఆసక్తి..



ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను చూసి చాలా ఆనందం కలిగింది. చిన్నగా కనిపించే బయోఫిలం ఫ్రూట్ ఫ్లైస్‌కు మనుషులకు చాలా దగ్గరి పోలికలు ఉండటంతో శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. మెదడులోని కణాలను వాటి పనితీరుపై తెలుసుకున్నా. సైన్స్‌పై ఆసక్తిని కలిగించినందుకు సీసీఎంబీకి కృతజ్ఞతలు. – సిద్దూ కుమార్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ స్కూల్, నకిరేకల్